క్లుప్తంగా

వైభవంగా సప్త శనివార సేవ



విజయవాడ కల్చరల్: శ్రీ శృంగేరీ పీఠపాలిత శివరామకృష్ణ క్షేత్రంలో శృంగేరీ పీఠాధిపతి భారతీ తీర్థ మహాస్వామి ఆదేశంతో సప్త శనివార సేవను వైభవంగా నిర్వహించారు. సర్వాలంకరణ భూషితుడైన శ్రీదేవి భూదేవి సమేతుడైన శ్రీ వేంకటేశ్వరునకు ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయ ప్రాంగణంలోని శ్రవణ సదనంలో లోక కల్యాణార్థం శ్రీ మహావిష్ణువు లక్షతులసి అర్చన, శ్రీనారాయణ గాయత్రి పూర్వక సహస్రనామ పఠన కార్యక్రమం జరిగింది. క్షేత్రం ధర్మాధికారి హనుమత్ ప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.

డాక్టర్ బీఎస్ రావుకు నివాళి



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): శ్రీచైతన్య విద్యా సంస్థల వ్యవస్థాపకుడు డాక్టర్ బీఎస్ రావుకు ఆయన కుమార్తె బొప్పన సుష్మ, శ్రీచైతన్య అకడమిక్ డైరెక్టర్ పుష్ప నివాళులు అర్పించారు. పునాదిపాడులోని శ్రీచైతన్య గోసాల శ్రీవైభవి క్యాంపస్‌లో బీఎస్ రావు సంతాప సభ శనివారం నిర్వహించారు. సుష్మ, పుష్ప హాజరై బీఎస్ రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శ్రీచైతన్య గోసాల క్యాంపస్ స్థాపించిన నాటి నుంచి వివిధ విభాగాల్లో పనిచేసిన దిగువ స్థాయి ఉద్యోగులకు నగదును అందజేశారు. శ్రీచైతన్య విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డీన్స్, ఏజీఎం, ప్రిన్సిపాల్స్ పాల్గొని బీఎస్ రావు చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య 133వ జయంతిని పురస్కరించుకుని శనివారం పాఠశాల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. నగరంలోని పలు పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా క్విజ్ పోటీల్లో పాల్గొన్నారు. గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్‌పర్సన్ జమల పూర్ణమ్మ మాట్లాడుతూ క్విజ్ పోటీల్లో విజేతలకు ఈనెల 24న సోమవారం బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కె.రమాదేవి, సిబ్బంది రాంబాబు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జ్యోతిర్లింగ సహిత దివ్య దక్షిణ యాత్ర

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దేశంలోని ముఖ్యమైన చారిత్రక, సాంస్కృతిక, పర్యాటక ప్రదేశాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్(ఐఆర్‌సీటీసీ) ఆధ్వర్యంలో నడుపుతున్న భారత్ గౌరవ్ యాత్ర రైలుకు సందర్శకుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఇందులో భాగంగా 'జ్యోతిర్లింగ సహిత దివ్య దక్షిణ యాత్ర'ను చేపట్టింది. ఈ రైలు దక్షిణాది రాష్ట్రాలైన తమిళనాడు, కేరళలోని ముఖ్యమైన పర్యాటక ప్రదేశాలైన తిరువణ్ణామలై, అరుణాచలం, మధురై, కన్యాకుమారి, త్రివేండ్రం, తిరుచ్చి, తంజావూరులను కవర్ చేస్తుంది. తెలంగాణలోని సికింద్రాబాద్, కాజీపేట, వరంగల్, ఖమ్మం, ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట స్టేషన్లలో ఆగుతుంది. ఆగస్టు 9, 23, సెప్టెంబర్ 5 తేదీల్లో ప్రారంభమయ్యే ఈ యాత్ర కోసం బుకింగ్‌లు ప్రారంభించారు. ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ లేదా కౌంటర్ బుకింగ్‌ల కోసం హైదరాబాద్ ఐఆర్‌సీటీసీ కార్యాలయం 040-27702407, 9701360701, విజయవాడ కార్యాలయం 9281495848 ఫోన్ నంబర్‌లలో సంప్రదించాల్సిందిగా అధికారులు కోరారు.

నేడు సాహితీవేత్తలు శ్రీరమణ, విశ్వనాథరెడ్డి సంస్మరణ సభ

విజయవాడ కల్చరల్: విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యాన ఆదివారం ఉదయం 11 గంటలకు సొసైటీ కార్యాలయంలో సాహితీవేత్తలు శ్రీ రమణ, ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి సంస్మరణ సభను నిర్వహిస్తునట్లు బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షుడు మనోహర నాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాహితీవేత్తలు పాల్గొంటారని పేర్కొన్నారు.

25న ఉమ్మడి జిల్లా రోప్ స్కిప్పింగ్ ఎంపికలు

కంకిపాడు: ఉమ్మడి కృష్ణా జిల్లా స్థాయి రోప్ స్కిప్పింగ్ ఎంపిక ప్రక్రియ ఈ నెల 25న ఈడుపుగల్లు నలంద విద్యానికేతన్‌లో నిర్వహించనున్నట్లు ఆ సంఘ జిల్లా కార్యదర్శి ఎం.వెంకటేష్ శనివారం తెలిపారు. అండర్-8, 10, 12, 14, 17 బాల బాలికల విభాగాల్లో జిల్లా స్థాయి స్కిప్పింగ్ ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 29, 30 తేదీల్లో కర్నూలులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సెంట్రల్‌లో అభివృద్ధి పరుగులు

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో సెంట్రల్ నియోజకవర్గం అభివృద్ధిలో పరుగులు పెడుతోందని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 59వ డివిజన్ అజిత్‌సింగ్‌నగర్‌లో రూ. 20 లక్షల నిధులతో నూతన రహదారి నిర్మాణ పనులకు స్థానిక కార్పొరేటర్ ఎండీషాహినా సుల్తానాతో కలిసి శనివారం ఆయన భూమిపూజ చేశారు. విష్ణు మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వంలో ప్రజల నుంచి విజ్ఞాపనల మేరకు సింగ్‌నగర్ ఫ్లైఓవర్ ఆరంభం నుంచి రైతుబజార్, తహసీల్దార్ కార్యాలయం వెనుక రోడ్డు మీదుగా రైల్వే ట్రాక్ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసుకున్నామన్నారు. గత ప్రభుత్వంలో డివిజన్‌లో కనీసం సైడ్ కాలువలు నిర్మించలేదని విమర్శించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటివరకు అనేక అభివృద్ధి పనులకు కోట్లాది రూపాయలను వెచ్చించినట్లు తెలిపారు.

ప్రత్యామ్నాయ మార్గాల అన్వేషణ

అజిత్‌సింగ్‌నగర్‌లో ట్రాఫిక్ దృష్ట్యా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నట్లు మల్లాది విష్ణు తెలిపారు. వాంబేకాలనీ నుంచి గుణదల, డిస్నీల్యాండ్ నుంచి గుణదల, హెచ్ బ్లాక్ నుంచి ఇన్నర్‌రింగ్ రోడ్డు.. ఇలా మూడు మార్గాలను అభివృద్ధి చేయడానికి ఆలోచన చేస్తున్నట్లు వెల్లడించారు. భూసేకరణతో నిమిత్తం లేకుండా వీలైనంత త్వరలో ఈ రోడ్లను అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఏఈ(ఇంజినీరింగ్) అరుణ్‌కుమార్, నాయకులు హఫీజుల్లా, నందెపు సురేష్, కంభగళ్ల రాజు, దేవిరెడ్డి రమేష్ రెడ్డి, నేరెళ్ల శివ, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాంధ్రప్రదేశ్ నిర్మాణమే లక్ష్యం



పాఠ్య పుస్తకాలు అందజేస్తున్న విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించడానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపడుతున్నట్లు ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 59వ డివిజన్ అజిత్‌సింగ్ నగర్‌లోని ఎం.కె.బేగ్ ప్రభుత్వ పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. స్థానిక కార్పొరేటర్ ఎండీ షాహినా సుల్తానాతో కలిసి విద్యార్థినీ విద్యార్థులకు సెకండ్‌సెమ్ పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ కార్పొరేట్, ప్రైవేట్ విద్యా బోధనకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో అధునాతనమైన విద్యను అందించాలన్న సంకల్పంతో సీఎం జగన్‌మోహన్ రెడ్డి పనిచేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో విద్యాలయాలు శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలిపోతాయో తెలియని దయనీయ పరిస్థితులలో ఉండేవని గుర్తు చేశారు.నేడు సకల వసతులతో స్కూళ్లు కళకళలాడుతున్నాయన్నారు. ఇతర రాష్ట్రాల కంటే 3 రెట్లు అధికంగా రాష్ట్ర ప్రభుత్వం విద్య కోసం ఖర్చు చేస్తోందని.. నాలుగేళ్లలో అక్షరాలా రూ.60,329 కోట్లు ఖర్చు చేయడమే దీనికి నిదర్శనమన్నారు. న్యూయార్క్‌లోని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయంలో నాడు-నేడు స్టాల్‌ను ప్రదర్శించడం మనందరికీ గర్వకారణమన్నారు. కార్యక్రమంలో హైస్కూల్ వైస్ ప్రిన్సిపాల్ మనోహర్, ఎలిమెంటరీ స్కూల్ ప్రిన్సిపాల్ ఇమామ్ బాషా, నాయకులు హఫీజుల్లా, నందెపు సురేష్, కంభగళ్ల రాజు, దేవిరెడ్డి రమేష్ రెడ్డి, నేరెళ్ల శివ తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా నృత్య నీరాజనం



విజయవాడకల్చరల్: శ్రీ వాగ్దేవీ కూచిపూడి నృత్యాలయ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించే నృత్య నీరాజనం 2023 కార్యక్రమాలు వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. నాట్యాచార్యులు సప్త శివకుమార్, మాగలూరి త్రినాథాచారి ఆధ్వర్యంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన చిన్నారులు సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించారు. వాగ్గేయకార కీర్తనలకు కూచిపూడి, భరతనాట్యం, సంప్రదాయంలో నృత్యాలను అభినయించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ పరీక్షల విభాగం కమిషనర్ డి.దేవానందరెడ్డి మాట్లాడుతూ.. సంప్రదాయ నృత్యాలను కాపాడుకోవాల్సిన అవసరముందన్నారు. భారతీయ నృత్య సంప్రదాయాలు దేశ కీర్తి ప్రతిష్టలను చాటుతున్నాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఓఎస్‌డీ చీఫ్ విప్ డాక్టర్ ఎం.ప్రభాకర్ మాట్లాడుతూ.. యువతలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. నాట్యాచార్యుడు సీహెచ్ అజయ్‌కుమార్, గాయకుడు కుమార సూర్యనారాయణ పాల్గొన్నారు. నాట్యాచార్యుడు రఘుపాత్రుని శ్రీకాంత్‌కు నాట్య విజ్ఞాన్ బిరుదుతో సత్కరించారు.

ట్రస్టు జాయింట్ కేర్‌లో రోబోటిక్ కీళ్ల మార్పిడిలు



మీడియాతో మాట్లాడుతున్న డాక్టర్ వెంకట రమణ, పక్కన భార్గవ్ తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): కీళ్ల మార్పిడిలో అత్యాధునిక పరిజ్ఞానమైన రోబోటిక్ శస్త్ర చికిత్సలను అందుబాటులోకి తీసుకువచ్చామని ట్రస్టు జాయింట్‌కేర్ సెంటర్ చైర్మన్ డాక్టర్ యు.వెంకట రమణ తెలిపారు. అందుకోసం ఫుల్లీ ఆటోమేటెడ్ రోబో క్యువిస్ పరికరాన్ని అందుబాటులోకి తెచ్చామన్నారు. పిన్నమనేని పాలిక్లినిక్‌రోడ్డులోని ఓ హోటల్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కీళ్ల సంరక్షణ, దెబ్బతిన్న కీళ్లు పనితీరును పునరుద్ధరించే లక్ష్యంతో ప్రత్యేక కేంద్రంగా ట్రస్టు జాయింట్ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు.

విదేశాల్లో శిక్షణ పొందిన అనుభవజ్ఞులైన వైద్యులు, అధునాతన జాయింట్ సేవింగ్ కార్టిలేజ్‌తో పునరుత్పత్తి చికిత్సలు, రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అమెరికా, జర్మనీల్లో ఆర్థోస్కోపీ, రోబోటిక్ శస్త్రచికిత్సల్లో శిక్షణ పొందిన డాక్టర్ భార్గవ్‌రామ్ మాట్లాడుతూ ఆర్థో రోబోటిక్ విధానం ద్వారా కచ్చితమైన కోత, పరిపూర్ణ అమరిక, తక్కువ నొప్పి, సహజసిద్ధమైనదిగా ఉండే జాయింట్ రీప్లేస్‌మెంట్ సాధ్యమవుతుందన్నారు. సమావేశంలో ఎనస్థీషియన్ డాక్టర్ ఎస్.పావనఫణి పాల్గొన్నారు.

చట్టాలపై మహిళలకు అవగాహన అవసరం



కృష్ణలంక(విజయవాడతూర్పు): లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై మహిళలు అవగాహన పెంచుకోవాలని హైకోర్టు న్యాయవాది మాగంటి అనూరాధ అన్నారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో విజ్ఞాన కేంద్రం, ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్ టౌన్ ఆధ్వర్యంలో లైంగిక వేధింపుల నిరోధక చట్టం, అమలు తీరుపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ చట్టం మహిళలకు ఏ రూపంలో ఉపయోగపడుతుందో వివరించారు. 10 మంది కన్నా ఎక్కువ మహిళలు పనిచేస్తున్న చోట అంతర్గత కమిటీలు వేయాలని, కార్యాలయాల్లో చట్టం అవగాహన కోసం బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. మరో న్యాయవాది చంద్ర రమాదేవి మాట్లాడుతూ మహిళలు రాజ్యాంగం కల్పించిన హక్కులను ఉపయోగించుకోవాలన్నారు. విజ్ఞాన కేంద్రం బాధ్యులు స్వరూపరాణి మాట్లాడుతూ 2013లో లైంగిక వేధింపుల నిరోధక చట్టం ఏర్పడినప్పటికి దాని అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. చట్టాలను పనిచేయించడం ద్వారా మహిళలకు న్యాయం జరగాలన్నారు. సదస్సులో ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్ టౌన్ ప్రెసిడెంట్ హరితా చౌదరి, సెక్రటరీ సరస్వతి, జనశిక్షణ సంస్థాన్ డైరక్టర్ పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో పేదలకు భరోసా



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నవరత్నాలతో అభివృద్ధి, సంక్షేమాన్ని పరుగులు పెట్టించటంతో పాటు పేదలకు భరోసా కల్పిస్తున్న ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 59 వ డివిజన్ 244వ వార్డు సచివాలయ పరిధిలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. కార్పొరేటర్ సుల్తానా, అధికారులతో కలిసి అజిత్‌సింగ్‌నగర్‌లో గడపగడపకు వెళ్లారు. వైఎస్సార్ సీపీకి నాలుగేళ్లలో ప్రజాదరణ రెట్టింపు అయిందన్నారు. మేనిఫెస్టోలో చెప్పిన హామీల్లో 98.5 శాతం అమలు చేయడంతో పాటు మరెన్నో హామీలను అమలు చేశారన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.

చంద్రబాబు, పవన్‌ది అవకాశవాద రాజకీయం

ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి జనరంజక పాలన చూసి ఓర్వలేని చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఈర్ష్యా ద్వేషాలతో రగిలిపోతున్నారని మల్లాది విష్ణు అన్నారు. అసూయతో రాష్ట్ర ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నారని మండిపడ్డారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌ది అవకాశవాద రాజకీయమన్నారు. పవన్ ఆలోచన, అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని.. ఆయనకు తెలిసిందల్లా చంద్రబాబు రాసిచ్చిన స్క్రిప్ట్ చదవడమేనని విమర్శించారు. తెలుగుదేశం హయాంలో డేటా చౌర్యం జరిగినప్పుడు మిత్రపక్షంలో ఉండి పవన్ ఎందుకు ప్రశ్నించలేదని మల్లాది విష్ణు అన్నారు. వచ్చే ఎన్నికల్లో 175 స్థానాల్లో వైసీపీ గెలుపు ఖాయమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఎంఓహెచ్ రామకోటేశ్వరరావు, సీడీఓ జగదీశ్వరి, నాయకులు హఫీజుల్లా, నందెపు సురేష్, కంభగళ్ల రాజు, దేవిరెడ్డి రమేష్ రెడ్డి, నేరెళ్ల శివ, నాయక్, పిల్లి లక్ష్మి, శాంతకుమారి, దినేష్ రెడ్డి, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యువతలో జాతీయ భావం పెంపునకు కృషి



కుచేల చరిత్ర గ్రంథ ఆవిష్కరణలో విజయాదిత్య, శ్యామలానంద ప్రసాద్,చక్రధర్ తదితరులు

విజయవాడ కల్చరల్: యువతలో జాతీయ భావం పెంచడానికి కృషి చేయాల్సిన అవసరముందని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ప్రాంత ప్రచారక్ విజయాదిత్య అన్నారు. జాతీయ కవితా వేదిక ఆధ్వర్యాన శనివారం గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో స్వాతంత్ర్య సమరయోధుడు కవి జింకా శంకరయ్య పంతులు 1927లో రచించిన కుచేల చరిత్ర, గోపికా వస్త్రాభరణం గ్రంథ ఆవిష్కరణ సభ జరిగింది. విజయాదిత్య మాట్లాడుతూ నాడు ఎంతోమంది సమరయోధుల త్యాగాలతో నేడు మనం స్వేచ్ఛా వాయువులు పీల్చుకుంటున్నామని చెప్పారు. డాక్టర్ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ మాట్లాడుతూ ఆంధ్ర సాహిత్యంలో ఎన్నో గ్రంథాలు కనుమరుగయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు వందేళ్ల క్రితం రాసిన గ్రంథాన్ని పునః ముద్రించిన జాతీయవాద కవితా వేదిక నిర్వాహకుడు జింకా చక్రధర్ కృషిని అభినందించారు. ఆవిష్కరణ కార్యక్రమంలో సంస్కృత అధ్యాపకుడు డాక్టర్ ఉపద్రష్ట వేంకటరమణమూర్తి, రచయిత దుర్గరాజు శ్రీనివాసరావు పాల్గొన్నారు. హరిబాలాశంకర్ గ్రంథ విశేషాలను తెలియజేశారు. కోర్సిపాటి శ్యాంప్రసాద్ రెడ్డి నిర్వహణలో జాతీయవాదం అంశంగా జరిగిన కవి సమ్మేళనంలో వివిధ ప్రాంతాల కవులు చేసిన స్వీయ కవితా గానం ఆసక్తికరంగా సాగింది.

ఇంటి ముందు నిలిపిన ద్విచక్ర వాహనం చోరీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఇంటి ముందు పార్కింగ్ చేసిన బైక్ మాయమైందంటూ శనివారం అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అజిత్‌సింగ్‌నగర్ లూనాసెంటర్ ప్రాంతానికి చెందిన షేక్ సుభాని తాపీ మేస్త్రి. ఆయన ఈనెల 19వ తేదీ రాత్రి 11 గంటలకు తన బైక్‌ను ఇంటి ముందు పార్కింగ్ చేశారు. తెల్లవారి చూసేసరికి ఇంటి ముందు పార్కింగ్ చేసిన బైక్ కనిపించలేదు. పలుచోట్ల వెదికినా ఫలితం లేదు. దీంతో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

శాస్త్రీయ సంగీత వైభవాన్ని చాటిన కచేరీలు



విజయవాడకల్చరల్: స్వరఝరి సంగీత సంస్థ ఆధ్వర్యంలో సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్ షష్టి పూర్తి సందర్భంగా లబ్బీపేట శ్రీ శారదా చంద్ర మౌళీశ్వర స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న శాస్త్రీయ సంగీత ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. శనివారం నాటి కార్యక్రమాలు ఎస్పీ ఆదిసుందరి గాత్ర కచేరీతో ప్రారంభమయ్యాయి. ఆర్.రాజేశ్వరి, ఆర్‌హెచ్‌పీ వరలక్ష్మి, బీవీఎస్ఎస్ కృష్ణ, పొన్నపల్లి రమాభగవాన్, పద్మశ్రీ తదితరులు పలు సంప్రదాయ కీర్తనలను ఆలపించారు. నగరానికి చెందిన సంగీత విద్వాంసులు పాల్గొన్నారు.

నేడు సుధాకర్‌కు స్వర్ణకంకణ ప్రదానం

సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణువర్ధన్, వైస్ ప్రిన్సిపాల్ గాయత్రి, విద్యాపరిషత్ డాక్టర్ పేరాల బాలమురళీ కృష్ణ సంగీత విద్వాంసుల సమక్షంలో రాత్రి 7 గంటలకు సుధాకర్‌కు స్వర్ణకంకణ సత్కారం జరుగుతుందని కార్యక్రమ నిర్వాహకుడు వేమూరి విశ్వనాథ్ చెప్పారు.

విద్య, వైద్య సేవలకు ప్రాధాన్యం

లయన్స్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వై.పి.సి. ప్రసాద్



లయన్స్‌క్లబ్ ఆఫ్ బెజవాడ మానవత నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రజల అవసరాలకు అనుగుణంగా విద్య, వైద్య సేవలకు ప్రాధాన్యమిస్తున్నామని లయన్స్ క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వై.పి.సి. ప్రసాద్ అన్నారు. సీతారాంపురంలో శనివారం లయన్స్ క్లబ్ ఆఫ్ బెజవాడ మానవత నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లయన్స్ క్లబ్స్.. అంధత్వ నిర్మూలన కార్యక్రమం ద్వారా 4 కోట్ల మందికి పైగా కంటి చూపు తెప్పించామన్నారు. క్లబ్ నూతన అధ్యక్షులు కోసూరు సుబ్రహ్మణ్యం(మణి) మాట్లాడుతూ ప్రజల అవసరాల మేరకు సేవలు అందిస్తామని తెలిపారు. అనంతరం లయన్స్ క్లబ్ ఆఫ్ బెజవాడ మానవత నూతన అధ్యక్షులు కోసూరి సుబ్రహ్మణ్యం, కార్యదర్శి కిలారు రవి, కోశాధికారి వీరంకి మోహన్‌రావుతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో చెన్నారెడ్డి శ్రీనివాసరెడ్డి, డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సెక్రటరీ వేమూరి సత్యనారాయణ, డిస్ట్రిక్ట్ క్యాబినెట్ ట్రెజరర్ కొల్లి నాగ వెంకట రామకృష్ణ ప్రసాద్, రీజియన్ చైర్‌పర్సన్ లయన్ పిన్నంరాజు త్రిమూర్తి రాజు, జోన్ చైర్ పర్సన్ అన్నే కుసుమ తదితరులు పాల్గొన్నారు.



ప్రకృతి ఒడిలో..

పాత ప్రభుత్వాస్పత్రిలోని మాతా శిశు కేంద్రంలో ప్రతి రోజు పెద్ద సంఖ్యలో రోగులు చికిత్స పొందుతుంటారు. ఆస్పత్రిలోకి ఒక రోగికి ఒక సహాయకుడిని మాత్రమే అనుమతిస్తారు. దీంతో రోగికి సాయంగా వచ్చిన మిగిలిన వారు ఆస్పత్రిలోని చెట్ల కింద ఏర్పాటు చేసిన సిమెంట్ బల్లలపై వేచి ఉంటారు. సహాయకుల కోసం వెయింటింగ్ హాలు ఉన్నా ప్రకృతి ఒడిలో చెట్ల కిందే సేదతీరుతారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

కెనరా ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రికెట్ మ్యాచ్‌లను ప్రారంభించిన కెనరా బ్యాంక్ జీఎం రవివర్మ, వీఆర్ సిద్ధార్థ ప్రిన్సిపాల్ రత్నప్రసాద్

పెనమలూరు: క్రీడలతో మానసిక ఒత్తిడికి దూరంగా ఉండొచ్చని కెనరా బ్యాంక్ విజయవాడ సర్కిల్ జనరల్ మేనేజర్ పి.రవివర్మ పేర్కొన్నారు. కెనరా బ్యాంక్ ఉద్యోగులకు కెనరా ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్‌లో శనివారం ప్రారంభించి ప్రసంగించారు. క్రీడలతో మానసిక ఒత్తిడి నుంచి దూరమవడమే కాకుండా క్రమశిక్షణతో కూడిన జీవితం గడపవచ్చని సూచించారు. కెనరా బ్యాంక్ ఉద్యోగులకు పని ఒత్తిడి లేకుండా చేయటానికి యాజమాన్యం దేశవ్యాప్తంగా సర్కిళ్ల పరిధిలో పురుష ఉద్యోగులకు క్రికెట్ పోటీలు, మహిళలకు బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తోందన్నారు.

ఉద్యోగులు కూడా పోటీల్లో పాల్గొని క్రీడాస్ఫూర్తిని చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎ.వి.రత్నప్రసాద్, డీన్ బావినేని పాండురంగారావు, కెనరా బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు. కెనరా ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలో 13 జట్లు పాల్గొన్నాయి. మొదటి రోజు విజయవాడ సర్కిల్ జట్టు కాకినాడ ఆర్‌ఓ జట్టుపై, వైజాగ్ 2 ఆర్‌ఓ జట్టు కర్నూల్ ఆర్‌ఓ జట్టుపై, నెల్లూరు ఆర్‌ఓ జట్టు వైజాగ్ ఆర్‌ఓ1 జట్టుపై, విజయవాడ ఆర్‌ఓ జట్టు ఒంగోలు జట్టుపై గెలుపొందాయి. ఆదివారం కూడా పోటీలు కొనసాగుతాయి.

విద్యార్థులు ఉన్నతస్థానాలకు చేరుకోవాలి



విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందజేస్తున్న కార్పొరేటర్ యర్రగొర్ల తిరుపతమ్మ

పాయకాపురం(విజయవాడరూరల్): కండ్రికలో బీవీ సుబ్బారెడ్డి వీఎంసీ హైస్కూల్లో 9వ తరగతి విద్యార్థులకు శనివారం సెమిస్టర్ -2 పాఠ్యపుస్తకాలను కార్పొరేటర్ యర్రగొర్ల తిరుపతమ్మ పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలను అందజేస్తున్నారన్నారు. చదువుకు పేదరికం అడ్డుకారాదని సీఎం.. విద్యావ్యవస్థలో మార్పులు చేశారని పేర్కొన్నారు. నాడు-నేడుతో నూతన తరగతి గదుల నిర్మాణం, మంచినీటి సదుపాయం, టాయిలెట్లు, బెంచీలు, లేబొరేటరీలు, గ్రీను బోర్డుల ఏర్పాటువంటి మౌలిక సదుపాయాలను సమకూర్చిన ఘనత మన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ నాగేశ్వరి, డివిజన్ కోఆర్డినేటర్ ఎస్‌కే ఇస్మాయిల్, పార్టీ నాయకులు అక్కిశెట్టి నారాయణ, కాశీవిశ్వేశ్వర ఆలయ కమిటీ సభ్యులు గొరిపర్తి వెంకటేశ్వరమ్మ, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు పాల్గొన్నారు.

27, 28 తేదీల్లో ఎస్‌ఆర్‌ఆర్‌లో నాక్ బృందం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ భాగ్యలక్ష్మి

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 27, 28 తేదీల్లో నాక్ బృందం పర్యటిస్తుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు. ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం సాయంత్రం విలేకరుల సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకమైన ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాలలో నాలుగో విడత నాక్ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఐదేళ్లకోసారి జరిగే నాక్ అక్రిడేషన్ కోసం విభాగాల వారీగా సన్నద్ధం చేశామన్నారు. కళాశాలకు అటానమస్ వచ్చిన తర్వాత జరుగుతున్న తొలి నాక్ అని ఇందులో కచ్చితంగా ఏ ప్లస్‌ప్లస్ సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.1937లో కళాశాల స్థాపించారని విద్యార్థులకు అన్ని విభాగాల్లో మెరుగైన వసతులు కల్పిస్తున్నారన్నారు. 2500 విద్యార్థులతో యూజీ, పీజీ కోర్సులతో కళాశాల అన్ని రంగాలలో ముందు వరుసలో ఉందని తెలిపారు. నాక్ బృందంలో ముగ్గురు ఉంటారని అందులో ఒక వైస్ చాన్సలర్, ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ ఉంటారని తెలిపారు. సమావేశంలో అధ్యాపకులు డాక్టర్ బాల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.